ఘనంగా ఆలయ వార్షికోత్సవం



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

రామంతాపూర్ : నెహ్రూనగర్‌లోని బద్ది పోచమ్మ ఆలయ ప్రాంగణంలోని శివ పంచాయతన పంచముఖి ఆంజనేయస్వామి ప్రథమ వార్షికోత్సవ వేడుకలను వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాల్లో గణపతిపూజ, మూలమంత్రం, పంచసూక్త, ఆకుపూజ, కుంకుమార్చన, అనంతరం చండీహోమం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వేదాంతం సాయికిరణ్ మాట్లాడుతూ.. చండీహోమంతో దుష్టశక్తులు దూరమై అన్ని శుభాలే జరుగుతాయన్నారు.

ముస్లిం జేఏసీ ఆవిర్భావం



సంతాపం తెలుపుతున్న ముస్లిం జేఏసీ నేతలు

మల్లాపూర్: ముస్లిం మైనార్టీల హక్కుల సాధన కోసం నూతనంగా ముస్లిం మైనార్టీ ఆవిర్భవించింది. శుక్రవారం నాచారంలోని బీఎస్పీ కార్యాలయంలో ముస్లిం మైనార్టీ జేఏసీ నేత మహ్మద్‌సిద్ధిక్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా నల్లారాధాకృష్ణ హాజరై మట్లాడారు. కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై కాల్పులు జరిపి 26 మందిని పొట్టనపెట్టుకున్న ముష్కరుల దాడిని ఖండించారు. వారి ఆత్మలు శాంతించాలని కోరుతూ.. 2 నిమిషాల పాటు మౌనం వహించారు. ఎండీ అఫ్రూ, మహ్మద్‌ఖలీల్, ఉబేర్, ఎండీగౌస్, ఫారుక్, ఖాదర్, ఎండీ అన్వర్, ఇసాక్, సాజీద్, ఇలియస్, ఖలీల్, అబ్దుల్‌రహమాన్ తదితరులున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ కౌకూర్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరిశీలించారు. అనంతరం కాలనీ వాసులతో పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భరత్ నగర్ జంక్షన్ వద్ద జరుగుతున్న ప్రధాన రహదారి అభివృద్ధి, బస్టాప్ నిర్మాణాన్ని పరిశీలించారు. భరత్‌నగర్ అభివృద్ధికి కృషి చేస్తున్న మైనంపల్లి హన్మంతరావుకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారని స్థానిక నేతలు మల్లికార్జున్ తెలిపారు. కాంగ్రెస్ నేతలు తోట లక్ష్మీకాంత్ రెడ్డి, సందీప్‌గౌడ్, చందు, శివ, అజయ్, జీహెచ్‌ఎంసీ అధికారి జగన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు అరికట్టడంలో ఆశాలది కీలకపాత్ర



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమాగౌరీ

ఉప్పల్: సీజనల్ వ్యాధుల నివారణ అరికట్టడంలో ఆశాకార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమాగౌరీ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఉప్పల్ ప్రాథమిక వైద్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా ప్రోగ్రామ్ అధికారి డా. శ్రీదేవి, శోభారాణి, డా.సత్యవతి, చంద్రకళ, ఉప్పల్ వైద్యాధికారి సౌశీల్యారాణి, బోగ ప్రకాష్ తదితరులున్నారు.

ప్రగతి చక్రం పురస్కారాల ప్రదానం

మేడ్చల్: ఆర్టీసీ డిపో పరిధిలో మార్చిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ శ్రామికులకు యాజమాన్యం ప్రగతి చక్రాల పురస్కారాలను అందజేసింది. శుక్రవారం డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎం సుధాకర్ కార్మికులను శాలువాలతో సన్మానించి మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. బ్రేక్‌డౌన్ లేకుండా బస్సులు నడపడం, ఇంధనం పొదుపు, వంటి వాటిలో ప్రతిభ చూపిన వారికి పురస్కారాలను అందజేశారు.

సొంతింటి కల నెరవేరేనా ..?

నత్తనడకన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాలు

- 8 ఏళ్లుగా కొనసాగుతున్న నిర్మాణాలు
- ప్రజాపాలనలో సైతం దరఖాస్తుల వెల్లువ
- ఎదురు చూస్తున్న లబ్ధిదారులు



జవహర్‌నగర్‌లో డబుల్‌బెడ్రూమ్‌లు

జవహర్‌నగర్: పేదోడి ఇంటి కల కలగానే మిగిలిపోయేలా ఉంది. ప్రతి ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో రాజకీయ నాయకులు పేదలందరికీ ఉచితంగా ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చి ఆ తర్వాత కాలం గడుపుతూ వెళ్లిపోతున్నారు. మేడ్చల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రజలు డబుల్‌బెడ్రూమ్‌లు ఎప్పుడిస్తారా.. అని ఆశగా ఎదురుచూస్తున్నారు. కొన్నిచోట్ల గత ప్రభుత్వం లబ్ధిదారులకు ఎన్నికలకు ముందు హడావిడిగా ఇళ్ల పంపిణీ చేసినా.. వాటిలో సౌకర్యాలు లేక విలవిలలాడుతున్నారు. కొన్నిచోట్ల డబుల్ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి.

◆ జవహర్‌నగర్‌లో సర్వేనెం. 829, 775, 776, 784, 720, 721, 722, 723, 725లలో దాదాపు 35 ఎకరాలలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు మొదలై దాదాపు ఏడేళ్లపైనే అవుతుంది. ప్రస్తుతం 20 ఎకరాలలో దాదాపు 1625 డబుల్ బెడ్రూమ్ నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 15 ఎకరాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా..

నియోజకవర్గంలోని డబుల్‌బెడ్రూమ్ దుస్థితి మరీ అధ్వానంగా తయారైంది. కిష్టాపూర్‌లో 80, సోమారంలో 30, జవహర్‌నగర్‌లో 1620, ఘట్‌కేసర్‌లో 50, కీసరలో 48, శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లిలో 100 డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు కట్టినా వాటిని లబ్ధిదారులకు కేటాయించకుండా నిరుపయోగంగా మారాయి.

ఇళ్లు నేటికీ పూర్తి కాలేదు..

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లు పూర్తికావాలంటే మరో ఏడాది పడుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని త్వరగా పూర్తి చేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

◆ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్‌బెడ్రూమ్‌లు నిరుపయోగంగా మారడంతో అవి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. కొన్నిచోట్ల తలుపులు, కిటికీలు ధ్వంసం చేశారు. మరి కొన్ని చోట్ల పిచ్చిమొక్కలు పెరిగి నిరుపయోగంగా మారాయి.

◆ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను ఎంపిక చేశారు. ఇంటిస్థలం ఉండి ఇళ్లు కట్టుకునేవారికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థికసాయం అందించనుంది. దీంతో నియోజకవర్గంలో వందలాది లబ్ధిదారులు ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం అధికారులు లబ్ధిదారుల ఎంపిక సర్వేలో ఉన్నారు. వాటిని అన్ని విధాల పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

స్థానికులకే ప్రాధాన్యమివ్వాలి..



జవహర్‌నగర్‌లో డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల పనులు మొదలై ఏడేళ్ల గడుస్తుంది. కేవలం ఎన్నిలొచ్చినప్పుడు మాత్రమే పేదలకు మాయమాటలు చెప్పి కాలం వెళ్లదీస్తున్నారు. జవహర్‌నగర్‌లో దాదాపు వందల కుటుంబాలు ఇళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా ఉన్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

– మేకల కావ్య, జవహర్‌నగర్ మాజీ మేయర్

దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడిచాయి.



రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఏడేళ్ల క్రితం చేసుకున్నాం. జవహర్‌నగర్‌లో 15 ఏళ్లుగా నిత్యం కూలీపనులు చేసుకుని బతుకుతున్నాం. మాకు వచ్చిన డబ్బులన్నీ ఇంటి అద్దెలకే సరిపోతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలి.

– యాలాల సునీత, జవహర్‌నగర్

అద్దె చెల్లించలేకపోతున్నాం..



ఎన్నికల సమయంలో ఇళ్లు లేని వారందరికీ డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు కట్టిస్తామన్నారు. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయలేదు. ఇప్పటికి అద్దె ఇళ్లలోనే జీవనం సాగిస్తున్నాం. నిరుపేదలను ప్రభుత్వం గుర్తించి ఇళ్లు ఇవ్వాలి.

– భాగ్యలక్ష్మి, బాలాజీనగర్

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



రామంతాపూర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీఆర్ఎస్ నేతలు

రామంతాపూర్ : 27న వరంగల్ ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ బహిరంగసభను విజయవంతం చేయాలని రామంతాపూర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక యాదవ సంఘంలో నిర్వహించిన బీఆర్ఎస్ సమావేశంలో పలువురు నేతలు మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో ప్రభుత్వ వైఫల్యం చెంది ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుందని హైడ్రా పేరుతో పేదల జీవితాలు నాశనం చేయడమే కాకుండా రైతులకు రుణమాఫీ సగమే చేసి ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. రామంతాపూర్ డివిజన్ నుంచి ఆవిర్భావ సభకు పెద్దఎత్తున ప్రజలు, కార్యకర్తలు హాజరయ్యేలా స్థానిక నేతలు కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ సీనియర్ నేతలు పసుల ప్రభాకర్‌రెడ్డి, సర్వబాబు యాదవ్, మహ్మద్ ముస్తాక్, పవన్, సతీష్, దయాకర్‌రెడ్డి, జహంగీర్, చాంద్‌పాషా, సంపత్, మోహన్, కిట్టు, ఆనంద్‌యాదవ్ తదితరులున్నారు.

ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం



కాప్రాలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంటమాలజిస్టులు

కాప్రా: ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కాప్రా ఎంటామాలజీ విభాగం ఆధ్వర్యంలో సర్కిల్ ఆఫీస్ నుంచి ఈసీఐఎల్ చౌరస్తా వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కాప్రా డీసీ జగన్, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ రమేష్, ఎంటమాలజీ సూపర్‌వైజర్లు తదితరులున్నారు.

మల్కాజిగిరి: దోమల నివారణకు ప్రజలు సహకరించాలని ఎంటమాలజీ విభాగం ఏఈ వనజ పిలుపునిచ్చారు. మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా సఫిల్‌గూడ మినీట్యాంక్ బండ్ నుంచి ఆనంద్‌బాగ్ వరకు ఎంటమాలజీ సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఈ వనజ మాట్లాడుతూ.. దోమల నివారణ సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలని, పాత సామగ్రి ముఖ్యంగా ఇంటిపైన టైర్లు, ఉపయోగించని కూలర్లలో నీరు ఉంటే దోమలు గుడ్లుపెట్టే అవకాశం ఉందన్నారు. దోమలు ఉండటం వలన డెంగీ, మలేరియా వ్యాధుల భారినపడే అవకాశం ఉందన్నారు. దోమల నివారణ కోసం క్రిమిసంహారిక మందులు స్ప్రే చేయడానికి వచ్చినప్పుడు సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. సూపర్‌వైజర్లు గురుచరణ్, నాగేందర్, నజీర్, షౌకత్, రాంచందర్ తదితరులున్నారు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం



కల్పన

మేడిపల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్కేసర్ మండలం కాచవాని సింగారం గ్రామంలో నివాసం ఉంటున్న కల్పన(29)ఇంట్లోనే ఉంటుంది. ఈనెల 23న మధ్యాహ్నం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు బంధువులు, పలుచోట్ల వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రాంతంలో ..



భాగ్యలక్ష్మి

అల్వాల్: మహిళ అదృశ్యమైన ఘటన నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరెడ్‌మెట్ డిఫెన్స్ కాలనీలోని సూర్యోదయ ఓల్డేజ్‌హోమ్‌లో నివసించే భాగ్యలక్ష్మి (50), ఈనెల 24న బయట కూర్చోవడానికి ఓల్డేజ్ హోమ్ నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆమె ఇంతకు ముందు కొన్నిసార్లు బయటకు వెళ్లి తిరిగి వచ్చేదని, ఆమెకు ఫిట్స్ కూడా వస్తుందని ఓల్డేజ్ హోమ్ నిర్వాహకులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: 11కేవీ ఎస్ఐఎన్ ఫీడర్ పరిధిలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనుల మరమ్మతుల కారణంగా 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8.00 గంటల నుంచి 10.00 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్, మల్లికార్జునగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

◆ 11కేవీ చెన్నారెడ్డి తోట ఫీడర్ పరిధిలో 33/11 కేవి పీర్జాదిగూడ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9.00 నుంచి 11.00 గంటల వరకు రాఘవేంద్రనగర్, మల్లికార్జుననగర్, అరోరా పీజీ కాలేజ్ తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదన్నారు.

◆ 11కేవీ మైవిల్లాస్ పెద్దమ్మగుడి ఫీడర్ పరిధిలో సమ్మర్ యాక్షన్‌ప్లాన్ పనుల మరమ్మత్తుల కారణంగా 33/11 కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5.30 కమలానగర్, మైవిల్లాస్, రామకృష్ణానగర్, అరవింద ఎన్‌క్లేవ్, కాకతీయకాలనీ, జయశ్రీకాలనీ, జైశ్రీరాం కాలనీ, కనకదుర్గానగర్, సిరిపురంకాలనీ, పెద్దమ్మగుడి ఏరియా, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ హరినాథ్ సగ్గు ఓ ప్రకటనలో తెలిపారు.

◆ 33/11 కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం 4.00 గంటల నుంచి 4.30 గంటల వరకు చెంగిచెర్ల మేయిన్ రోడ్డు, క్రాంతి కాలనీ, ద్వారకానగర్, ఆర్టీసీకాలనీ, వెంకటసాయినగర్, ప్రీవిలేజ్‌లలో కరెంట్ నిలిపి వేయబడుతుందని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

బోడుప్పల్: ఫీడర్ బైఫర్‌కేషన్ పనుల నిమిత్తం పలు కాలనీల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు రాజశేఖర్‌కాలనీ, సూర్యహిల్స్, సాయిభవానీనగర్, గాయత్రిహిల్స్, హేమానగర్, తిరుమల మెడోస్, రెడ్డీస్‌కాలనీ, వాసవీనగర్, మల్లయ్య నగర్, బాలాజీహిల్స్, పద్మావతికాలనీ, ఆంజనేయనగర్, ద్వారకానగర్, కేశవనగర్, గాయత్రీనగర్, బృందావన్‌కాలనీ, రాఘవేంద్రకాలనీ, మారుతీనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ఆర్ఎన్ఎస్ కాలనీ, సాయినగర్, పద్మావతి కాలనీ, అంబేద్కర్‌నగర్, దేవేందర్‌నగర్, శుభోదయకాలనీ, టెలిఫోన్‌కాలనీ, శ్రీలక్ష్మినగర్, ఐబిసిటీకాలనీ, బొల్లిగూడెం, రాజలింగం కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ శివపురికాలనీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు శివపురికాలనీ, భ్రమరాంబికానగర్, అష్టభుజాదేవి మందిర ప్రాంతం, ఏడీఆర్ ఆసుపత్రి ఏరియా, వెస్ట్ ఆనంద్‌బాగ్ ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

ఉప్పల్: నాచారం 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు హబ్సిగూడ హరిజన బస్తీ, కాకతీయనగర్, పీఅండ్‌టీ కాలనీ, ఎస్ కాంప్లెక్స్, హబ్సిగూడ చౌరస్తా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గణేష్ తెలిపారు.

రామంతాపూర్ : విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గణేష్‌నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు శారదానగర్, ఓల్డ్ రామంతాపూర్ ఏడీఆర్ ఎం లైన్, నెహ్రూనగర్ పార్ట్ ఆఫ్ ఇందిరానగర్‌తో పాటు గోకుల్‌నగర్‌లలో విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ప్రగతినగర్ మెయిన్ రోడ్డు, డీమార్ట్, ఇందిరానగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని ఏఈ లావణ్య కోరారు.

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ నోమా సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శ్రీనివాస్‌నగర్, మై ఫ్లవర్ గ్రాండ్‌పార్కు, జనప్రియ టౌన్‌షిప్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ నాగరాజు ప్రకటనలో తెలిపారు.

అధికారుల తీరు మారాలి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి, అల్వాల్ సర్కిళ్ల పరిధిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కొంతమంది అధికారుల తీరు మారాల్సిన అవసరం ఉందని, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. క్యాంప్ కార్యాలయాన్ని కేటాయించినందుకు నిరసనగా సర్కిల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే నిరసన మూడో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వివిధ ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మూడ్రోజులుగా నిరసన తెలియజేస్తూ.. కార్యాలయం బయట ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నా.. అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకుండా పోయిందన్నారు. నియోజకవర్గంలో వివిధ విభాగాల అధికారులు కొన్ని ఒత్తిళ్లకు గురై పనిచేస్తున్నారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి ఉందని, ఈ విషయం ప్రజలకు కూడా తెలుసునన్నారు. కొందరు పబ్లిసిటీ కోసం చేస్తున్నారని విమర్శలు చేస్తున్నారని, ఆ అవసరం తనకు లేదన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని చోట్ల ఎమ్మెల్యేలకు క్యాంప్ కార్యాలయాలు ఏర్పాటయ్యాయని ఇక్కడ ఆ ప్రయత్నాలు జరగలేదన్నారు. సుమారు రూ.8,60,500లకు సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను 22 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్పొరేటర్ సునీతాయాదవ్, నాయకులు మురుగేష్, పరశురామిరెడ్డి, రావుల అంజయ్య, వెంకన్న, శ్రీనివాస్‌గౌడ్, రాముయాదవ్, ఉపేందర్, బాబురావు తదితరులున్నారు.



మేడిపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ

ఉగ్రవాదాన్ని రూపుమాపాలి

మేడిపల్లి: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై అత్యంత క్రూరంగా కాల్పులు జరిపి ఉగ్రవాదులు నరమేధం సృష్టించిన విషయం తెలిసిందే. దేశంలో ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించి వేయాలని, మేడిపల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లయన్ వేముల నాథంగౌడ్ డిమాండ్ చేశారు. అనంతరం శుక్రవారం ఉప్పల్ డిపో నుంచి లయన్స్ క్లబ్ ఆఫీస్ కేఎల్ఎం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించి, ఉగ్రదాడిలో చనిపోయిన వారికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదులకు వత్తాసు పలికి, ప్రోత్సహించే వారు అత్యంత ప్రమాదకరమన్నారు. అలాంటి వారికి ఈ దేశంలో చోటు లేదన్నారు. పల్లె బాలరాజ్‌గౌడ్, మిరియాల అశోక్, లావణ్య, సావిత్రి, దుర్గా, చందనాపటేల్, మహేందర్‌రావు, రవీందర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ మేడిపల్లి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: పహల్గాంలో ఉగ్రమూకల దాడిని ఖండిస్తూ బీజేపీ నాయకుడు శాదిగౌండ కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మేడిపల్లిలో బీజేపీనేతలు, భరత్‌పురికాలనీ, పీఅండ్‌టీ కాలనీ, కమలానగర్ కాలనీల ప్రజలు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉగ్రమూకల దాడిలో చనిపోయిన మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

బోడుప్పల్: ప్రజల రాకపోకలకు కేటాయించిన రోడ్డును ఆక్రమించి నిర్మించిన ఓ భవనాన్ని శుక్రవారం మున్సిపల్ అధికారులు జేసీబీతో సాయంతో కూల్చివేశారు. బోడుప్పల్ కమిషనర్ శైలజ మాట్లాడుతూ.. ఆర్ఎన్ఎస్ కాలనీలో లేఅవుట్‌లో చూపిన రోడ్డును ఆక్రమించిన విజన్ కాలేజీని కలుపుకుని భవనం నిర్మించారన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు సదరు నిర్మాణాన్ని కూల్చివేశామన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. టీపీఓ కావ్య, మున్సిపల్ సిబ్బంది, మేడిపల్లి పోలీసులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభం



కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: వేసవిలో తప్పనిసరిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని వివిధ కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులకు ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి సూచించారు. ఉప్పల్ కాంగ్రెస్ ఓబీసీ ప్రధాన కార్యదర్శి ఈగ రాజేష్ ఆధ్వర్యంలో ఉప్పల్ శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. లింగంపల్లి రామకృష్ణ, మోహన్‌రెడ్డి ప్రకాష్, శంకర్, దేవిరెడ్డి పాల్గొన్నారు.

సమాజ సేవకు ఉత్తమ పురస్కారం



బండి రమ్య సతీష్‌లను సన్మానిస్తున్న చైతన్య నాట్యమండలి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ కార్పొరేటర్‌గా ప్రజలకు ఉత్తమ సేవలందించినందుకు బండి రమ్యసతీష్‌గౌడ్‌లకు ఉత్తమ పురస్కారం లభించింది. నగరంలోని త్యాగరాజగానసభలో చైతన్య నాట్య మండలి (దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్) 30వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేదికపై పలు సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం చైతన్య నాట్య మండలి ఆధ్వర్యంలో ప్రముఖులకు తమదైన శైలిలో పలువురి సత్కరించారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ కార్పొరేటర్‌గా ఐదేళ్ల పాటు ప్రజలకు అత్యుత్తమ సేవల్లో భాగంగా కరోనా సమయంలో బాధితులకు అత్యుత్తమ సేవలందించిన బండి రమ్యసతీష్‌గౌడ్‌లకు అవార్డుతో సన్మానించి, బిరుదును మాజీ ఐపీఎస్ సీఎన్.గోపీనాథ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రదానం చేశారు. చైతన్య నాట్యమండలి అధ్యక్షుడు మునికుమార్, వ్యవస్థాపకుడు బీజే.రాజు, సంయుక్త కార్యదర్శి సోమశేఖర్‌బాబు, రాజు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు పక్కా భవనం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజిత

ఉప్పల్: ఉప్పల్ సీనియర్ సిటిజన్‌లకు పక్కా భవనాన్ని నిర్మిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ ప్రధాన రహదారిలో సీనియర్ సిటిజన్ల సంక్షేమం భవనం కోసం 400 గజాల స్థలాన్ని కేటాయించిన సంగతి తెలిసిందే. అదే స్థలంలో రూ.20 లక్షలతో పక్కా భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణం పూర్తైన తర్వాత మౌలికవసతులు, ఆట పరికరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి, స్థానికులు వెంకటయ్య, బుచ్చిరెడ్డి, రామిరెడ్డి, మనోహర్, నారాయణ పాపిరెడ్డి తదితరులున్నారు.

అసభ్యకర ఫొటోలు తీశారని విద్యార్థినుల నిరసన

అవాస్తవమన్న కళాశాల ప్రిన్సిపాల్

ఘట్‌కేసర్: అవుషాపూర్ వీబీఐటీ కళాశాల అమ్మాయిల అసభ్యకరమైన ఫొటోలు తీసి ఇతర సిబ్బందికి పంపించారని ఆరోపిస్తూ.. ఆ కళాశాల గేటు ఎదుట విద్యార్థులు శుక్రవారం నిరసన చేపట్టారు. కాగా గురువారం హాస్టల్ స్నాక్స్‌లో పురుగులు వచ్చాయని ఆరోపిస్తూ.. విద్యార్థులు వార్డెన్‌ను నిలదీయగా నిరసన తెలుపుతున్న వారి ఫొటోలు తీసి చీఫ్ వార్డెన్‌కు పంపింది. తిరిగి గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఉదయం తీసిన నిరసన ఫొటోలు, వీడియోలు గల ఫోన్‌కావాలని విద్యార్థులు పట్టుబట్టడంతో చీఫ్ వార్డెన్ ఫోన్‌ను తెప్పించి పరిశీలించగా అందులో అమ్మాయిలు అసభ్యకరమైన ఫొటోలు లేవని వారితో మాట్లాడి సమస్యను ముగించారు. అసభ్యకరమైన ఫొటోలపై కళాశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. శుక్రవారం మధ్యాహ్నం ఉదయం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కళాశాల లోపలికి వచ్చి విద్యార్థులను రెచ్చగొట్టి ఆందోళన చేయించి విధ్వంసం చేయించారన్నారు. రాజకీయ దురుద్దేశంతో కళాశాల పేరు అప్రతిష్టపాలు చేయాలని గొడవను సృష్టించారని తెలిపారు.